www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024

5

చిత్తూరు



మంచి ఫలితాలు సాధించాలి

జడ్పీ వైస్ చైర్పర్సన్ రమ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన, గిరిజన, మైనారిటీలు, వివిధ ప్రతిభావంతుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి వారి ఆర్థిక అభివృద్ధిని ఆకాంక్షిస్తుందని జడ్పీ వైస్ చైర్పర్సన్ రమ్య అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఛాంబర్లో ఆరవ స్థాయి సంఘమైన సాంఘిక సంక్షేమ స్థాయి సంఘసమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, ఈ తరగతుల వారికి కేటాయించడం జరిగిందని ఆర్థిక అసమానతన్ని పోగొట్టడానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడం జరిగిందని అన్నారు. సాంఘిక సంక్షేమ వెనుకబడిన, గిరిజన పాఠశాలల హాస్టళ్లలో చదివే విద్యార్థులు త్వరలో జరగబోయే పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల ద్వారా అందిస్తున్న పథకాల గురించి అధికారులు వివరించారు. జడ్పీ సీఈఓ, ప్రభాకర్ రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిటీ చైర్మన్ భారతి పాల్గొన్నారు.

ఎన్నికల బడ్జెట్



- ఆదాయ పన్ను వర్గాలకు లభించని ఊరట
- వ్యవసాయానికి అత్తెసరు నిధులే
- రాయలసీమ తలమానికమైన 'ఉక్కు' ఊసేలేదు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో


కేంద్ర బడ్జెట్ నిరాశను మిగిల్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఓట్ ఆన్ బడ్జెట్‌ను గురువారం సుమారు రూ.47.66 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. రాయలసీమకు తలమానికంగా రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమకు నిధుల కేటాయింపే లేదు. రూ.2.55 లక్షల కోట్లతో రైల్వేబడ్జెట్ ప్రస్తావన చేసింది. ప్రాజెక్టుల వారీగా కేటాయింపుల వివరాలు తెలియడం లేదు. రైల్వే బడ్జెట్‌లోనూ కడప-బెంగళూరు రైల్వేలైన్ సహా పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల ప్రస్తావన చేయలేదు. విభజన హామీలను పూర్తిగా విస్మరించింది. కార్పొరేట్ల ప్రోత్సాహకాలు, పాడి రైతుల ప్రోత్సాహానికి ప్రత్యేక పథకాన్ని ఉటంకించింది. వేతనజీవులను నిరాశ పరిచింది. రైతుల ఆదాయం రెట్టింపు చేయడాన్ని విస్మరించి అధికం చేస్తామని పేర్కొంది. గతేడాది వ్యవసాయానికి కేటాయించిన రూ.1.25 లక్ష కోట్లకు రూ. రెండు లక్షలను జత చేసి అత్తెసరు కేటాయింపులకు పరిమితం కావడం విస్మయాన్ని కలిగించింది.

ఆదాయ పన్ను వర్గాలకు స్లాబులు యథాతథం

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ త్వరలో జరగనున్న ఎన్నికల బడ్జెట్‌గా ఉందని, అంతా అబద్ధాలతో నిండి ఉందని ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. ఎంతో ఆశగా ఎదురుచూసిన ఆదాయ పన్ను వర్గాలకు స్లాబులు యథాతథంగా ఉండడంతో ఉద్యోగ ఉపాధ్యాయుల్లో ఏమాత్రం ఊరట లభించని పరిస్థితి. పన్ను స్లాబుల్లో ఎలాంటి మార్పు లేదని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అయితే వచ్చే ఐదేళ్లలో స్వర్ణయుగం కానుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తుందని పేర్కొనడం ప్రజల చెవిలో పువ్వు పెట్టడమే. 3-6 లక్షల మధ్య ఆదాయంపై ఐదు శాతం, 6-9 లక్షల మధ్య 10శాతం, 9-12 మధ్య 15శాతం, 12-15 లక్షల మధ్య 20శాతం, 15 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉంటే 30శాతం పన్ను విధించనున్నారు. కొత్త పన్ను విధానంలో పన్ను రేట్లు అన్ని వర్గాలకు, సీనియర్ సిటిజన్లకు, సూపర్ సీనియర్ సిటిజన్లకు ఒకేలా ఉంటాయి. పాత పన్ను విధానంలో రూ. 2.5 లక్షల వరకూ ఆదాయ పన్ను మినహాయించబడింది. 2.5 నుంచి 5 లక్షల మధ్య శాతం పన్ను విధిస్తున్నారు. అలాగే 10 లక్షలకు పైబడిన వ్యక్తిగత ఆదాయంపై 30శాతం పన్ను విధిస్తున్నారు. పాత పన్ను విధానంలో ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి సీనియర్ సిటిజన్లకు 3 లక్షల వరకు ఉంటుంది. సూపర్ సీనియర్ సిటిజన్లకు ఐదు లక్షల వరకు ఉంటుంది. దేశవ్యాప్త ంగా 83 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని తొమ్మిది కోట్ల మంది మహిళలకు మేలు చేస్తామని పేర్కొంది. వీరితోపాటు దేశంలోని అంగన్వాడీలు, ఆశాలను ఆయుష్మాన్‌భారత్ పరిధిలోకి తీసుకుని రావడం కొంత ఉపశమనాన్ని కలిగించింది.

సుదీర్ఘ, స్ఫూర్తిదాయక పోరాటం

టిటిడి అటవీ కార్మికుల ఘన విజయం



- టైం స్కేలు వర్తింపజేస్తూ 8 వేలు వేతనం పెంపు
- టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడి
- నిత్యం అండగా అఖిలపక్ష, పౌరసమాజం
- 38 నెలల నిర్విరామ రిలే నిరాహార దీక్ష ముగింపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పోరాడుతున్న అటవీ కార్మికులను టిటిడి శ్రీలక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ నుంచి మినహాయించామని, వారికి టైం స్కేల్ వర్తింప చేస్తూ వేతనాలు పెంచు తున్నామని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ప్రకటించారు. దీంతో 38 నెలలుగా అటవీ కార్మికులు చేస్తున్న నిర్విరామ రిలే నిరాహారదీక్షలను విరమించారు. ఎట్టకేలకు తిరుమల శ్రీవారి పాదాల చెంత బలహీనుల ఆక్రందనకు న్యాయం జరిగింది. బక్కచిక్కిన శరీరాలు అలిసిపోయినా విరామం ఎరుగక సుదీర్ఘకాలం వీరు జరిపిన పోరాటం స్ఫూర్తిదాయకంగా టిటిడి చరిత్రలో నిలిచిపోయింది.

సిఎం జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చాలంటూ గత 38 నెలలుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న అటవీ కార్మికులు, సమస్యను టిటిడి పట్టించుకోని పక్షంలో న్యాయం కోసం జనవరి 27 నుంచి నిరవధిక నిరాహారదీక్షను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి నేతృత్వంలో ప్రారంభించారు. 29న అర్ధరాత్రి టిటిడి పోలీసులను ఉసిగొల్పి అరెస్టు చేయించడంతో, మరో బృందం పట్టువీడక నిరవధిక నిరాహారదీక్షను కొనసాగించింది. గత ఆరు రోజులుగా సాగుతున్న నిరవధిక నిరాహారదీక్షలు తీవ్ర ఉద్రిక్త పరిస్థితిని సృష్టించాయి. ఈ నేపథ్యంలోనే సిఐటియు ఆధ్వర్యంలో గురువారం టిటిడి పరిపాలనా భవనం వద్ద రాజకీయ పార్టీలు, పౌరసమాజ ప్రముఖులు సంఘీభావంగా నిరాహారదీక్షకు పూనుకున్నాయి.

చర్చలు జరిగిన తీరు

టిటిడి పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి జోక్యంతో జెఇఒ వీరబ్రహ్మం, లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ సిఇఒ శేషశైలేంద్ర, టిటిడి ఫారెస్టు డిఎఫ్ఒ శ్రీనివాసులు యుద్ధప్రాతిపదికన గురువారం మధ్యాహ్నం సిఐటియు నేతలు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, అటవీ కార్మికులతో చర్చలు జరిపారు. చర్చలలో మౌలికమైన డిమాండ్ లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ నుంచి కార్మికులను మినహాయించాలని నేతలు కోరడంతో టిటిడి యాజమాన్యం అంగీకరించింది. పర్మినెంట్ తమ పరిధిలో లేని అంశం కనుక కార్మికులకు టైంస్కేల్ వర్తింపజేస్తామని, 2023 పిఆర్‌సి ప్రాతిపదికన 20వేల రూపాయల బేసిక్‌తో 22,600 వేతనం చెల్లిస్తామని అధికారులు ప్రతిపాదించారు. నేతలు పునరాలోచన చేయాలని కోరడంతో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి జోక్యం చేసుకుని కార్మికులకు మరో 3,125 రూపాయలు వేతనం పెంచుతూ, ప్రతి రెండేళ్లకోసారి ఒక్కో కార్మికునికి 25మొక్కల పెంపకం బాధ్యతను అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఇంచుమించు పర్మినెంట్ కార్మికుల వేతనానికి దగ్గరగా ఉండడంతో చర్చలు సఫలమయ్యాయి.

దీక్షలు విరమింపజేసిన టిటిడి ఛైర్మన్

టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సాయంత్రం 6 గంటలకు హరే రామ హరే కష్ణ రోడ్డులోని నిరాహార దీక్షా శిబిరం వద్దకు నేరుగా వచ్చి పై ప్రకటన చేశారు. నిరాహార దీక్షలో ఉన్న కార్మికులను పేరుపేరునా పలకరిస్తూ నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింప చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ తిరుపతి నగరంలోని వివిధ రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలతో పాటు తిరుపతి ప్రముఖుల అపూర్వమైన మద్దతు ఈ ఉద్యమానికి లభించిందని అందరికీ ధన్యవాదాలు తెలిపారు. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డిలు సమస్య పరిష్కారానికి చొరవ చూపారన్నారు.

నిరాహారదీక్షల్లో 'మేము సైతం'

తాజాగా జరిగిన టిటిడి పాలకమండలిలో ఎటువంటి నిర్ణయం చేయకపోవడం, బుధవారం సాయంత్రం వరకూ టిటిడి నుంచి ఎటువంటి సానుకూల ప్రకటన ప్రకటించని నేపథ్యంలో గురువారం 'పౌరసమాజం', రాజకీయ పక్షాల ఆధ్వర్యంలో సంఘీభావ దీక్షలకు పూనుకున్నారు. ఈ దీక్షల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వి. నాగరాజు, రిపబ్లికన్ పార్టీ నేత పూతలపట్టు అంజయ్య, తెలుగుదేశం పార్టీ నేత ఆర్సీ మునికష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నాగేష్, వెంకటాచలపతి, బాలసుబ్రమణ్యం, జై భారత్ పార్టీ నాయకురాలు ముని లక్ష్మి, సాకం నాగరాజు, సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ, తమటం రామచంద్రారెడ్డి, డాక్టర్ బాలాజీ, డిఎంసి భాస్కర్ లతో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, నేతలు టి. సుబ్రమణ్యం, వేణు, జయచంద్ర, మాధవ్, ఆర్ లక్ష్మి, రఘు, బుజ్జి, నాగ వెంకటేష్, ముని రాజా, చిన్నా తదితరులు పాల్గొన్నారు. ఉద్యమానికి సహకరించిన అందరికీ అటవీ కార్మిక నేతలు ఈశ్వర్ రెడ్డి, సురేష్‌లు ధన్యవాదాలు తెలిపారు.



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి


ప్రజాపోరాటాలు చేస్తున్న సిపిఎంను ఆదరించండి..

ఇంటింటికీ ప్రజానిధి సేకరణలో జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు



ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం ప్రజాపోరాటాలు నిర్వహిస్తూ ప్రజల పక్షాన ఉద్యమాలు నిర్వహిస్తున్న సిపిఎం పలమనేరులో ఇంటింటికి ప్రజానిధి సేకరణ చేస్తున్న సందర్భంగా ఆదరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ ప్రజానిధి సేకరణలో భాగంగా గురువారం చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలో ఇంటింటికి ప్రజానిధి సేకరణ కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమం 15వ తేదీ వరకు జరుగుతుందని ప్రజలు శ్రేయోభిలాషులు అందరూ సిపిఎంకి ప్రజానిధిని ఇచ్చి సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రతి బూర్జువా పార్టీ ప్రజల దగ్గరకు వచ్చి అబద్దాలు చెప్పి డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసి ఓట్లు అడుగుతారని అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాల మీద భారాల మోపుతారని విమర్శించారు. కానీ సిపిఎం మాత్రం ప్రజల నుంచే ప్రజానిధి వసూలు చేసి ప్రజల కోసం పనిచేస్తుందని తెలిపారు. బూర్జువా పార్టీలు కార్పొరేట్ శక్తుల వద్ద కాంట్రాక్టుల వద్ద వేల కోట్లు వసూలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత వారి కోసం ప్రభుత్వాలు పనిచేస్తాయని తెలిపారు. కానీ దానికి భిన్నంగా సిపిఎం ప్రజల నుంచే ప్రజాపోరాటాలు నిర్వహిస్తూ ప్రజాసమస్యలపై నిరంతరం పనిచేస్తున్నదన్నారు. రాష్ట్రంలో ఐదు సంవత్సరాలుగా ప్రత్యేక హోదా కోసం, ఉపాధి కోసం, మహిళలపై జరుగుతున్న దాడులపై నిరసనగా, ప్రజలపై భారం పడుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు రేట్లు తగ్గించాలని అనేక రకాల పోరాటాలు నిర్వహించిన ఘనత సిపిఎందే అన్నారు. అందువల్లే ప్రజలందరూ కూడా సిపిఎం ఉద్యమాలను సిపిఎం కార్యక్రమాలను బలపరిచి పార్టీ బలోపేతానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు, పట్టణ నాయకులు ఈశ్వరయ్య, జయంతి, ధనలక్ష్మి, రాజా, సుబ్రమణ్యం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలపై జంట ఏనుగుల దాడి



ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువు మొరవ వద్ద ఉన్న పలువురి రైతుల పంట పొలాలలో జంట ఏనుగులు బుధవారం సాయంత్రం ఏడు గంటల నుండి రాత్రి ఒంటిగంట వరకు తిరుగాడి అరటి, చెరకు, మామిడి పంటలపై దాడి చేసి నష్టపరిచినట్టు రైతులు తెలిపారు. ఇరికిపెంట (పార్వతి నగర్) బంగ్లాకు చెందిన రాజన్న అరటి తోటకు సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో రెండు ఏనుగులు రావడంతో అప్రమత్తమైన భూయజమాని గట్టిగా కేకలు వేస్తూ ఫారెస్ట్ సిబ్బంది వారికి విషయాన్ని తెలిపారు. వారు రాగానే వారితో కలిసి 15మంది రైతులు టపాసులు పేలుస్తూ ఏనుగులను తరిమేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. అయితే టపాసుల శబ్దాలకు రైతుల అరుపులకు ఏమాత్రం బెదరని జంట ఏనుగులు వారి మీదికే దాడి చేసేందుకు వస్తూ రాజన్న అరటి పంటను పూర్తిగా ధ్వంసం చేసి పక్కనే ఉన్న మరొక రైతుకు చెందిన చెరకు పంటపై, సమీపంలోని మామిడి తోటపై దాడి చేసి కొంతమేర ధ్వంసం చేసి వెళ్లిపోయాయి. అయితే అవి నేరుగా బంగ్లా సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కగా నడుచుకుంటూ సోమల -పుంగనూరు ప్రధాన రహదారిని దాటుకొని దాదెం గొల్లపల్లి, పార్వతి నగర్, మేటిమంద అటవీ ప్రాంతాల్లోకి వెళ్లినట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీనిపై సర్పంచ్ రెడ్డప్పను వివరణ కోరగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు పంచాయతీలోని పలు గ్రామాలలో దండోరా వేయించడం జరిగిందని, రైతులు, ప్రజలు రాత్రివేళ ఒంటరిగా తిరగరాదని, పొలాల వద్ద రైతులు అగ్గిమంటలు వేసుకొని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఇదే ప్రాంతంలో గతంలో కూడా ఏనుగులు సంచరించడం పంటలకు నష్టం కలిగించడం జరిగిందని, మళ్లీ జంట ఏనుగులు ఈ ప్రాంతానికి రావడం సమీపంలోనే తిరుగుగాడడం ప్రజలకు రైతులకు ఆందోళన కలిగిస్తోంది.

పింఛన్లు పంపిణీ వేగవంతం

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : జెడ్‌పి ఛైర్మన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, భారీ ఎత్తున భవనాలు నిర్మించడంతోపాటు ఉద్యోగుల నియామకాలు చేసుకోవడం జరిగిందని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వారి ద్వారా వేగంగా జరుగుతున్నాయని వాటన్నింటినీ ఉపయోగించుకుని జిల్లాను అన్ని రంగాల్లో మొదటిస్థానంలో నిలపాలని జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. గురువారం నాడు 2, 3, 4, 5, 6 జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి. చైర్మన్ ఆధ్వర్యంలో రెండు, నాలుగు స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలో డిఆర్‌డిఏ, డ్వామా, గృహ నిర్మాణశాఖ, పరిశ్రమలశాఖ, పంచాయతీరాజ్ శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పథకాలను సంబంధిత అధికారులు వివరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రధానమైనదని అతివేగంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం మన జిల్లాలో చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వివిధ పథకాలకు సంబంధించి అర్హులైన వారు పొందిన పథకాలను ఏవిధంగా సద్వినియోగం చేసుకొంటున్నారో పరిశీలించాలన్నారు. కరువును పారదోలి ఉపాధి హామీ పనులను కల్పించడంలో డ్వామా అధికారుల కృషి మరువలేనిదని వివరించారు. జిల్లాలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారని, రోజు 50 వేల లీటర్ల పాల సేకరణకు యంత్రాంగం పనిచేస్తుందని అన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని వాటర్ ట్యాంకులు శుభ్రం చేసుకోవడంతో పాటు మంచినీటి పైపు లైనులకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీరాజ్ శాఖపై ఉన్నదని అన్నారు. 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారని సంక్షేమ హాస్టల్స్‌ల్లో, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు పొందేలా మరింత కృషి చేయాలని అన్నారు. వైద్యవిధాన పరిషత్ ద్వారా జిల్లాలో అత్యుత్తమమైన సేవలు ప్రజలకు వారి ఇళ్ల వద్దనే అందించడం జరుగుతొందని, మందులు పంపిణీకి కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సేవలను ప్రజలు ఉపయోగించుకుని విద్యవైద్య రంగాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థాయి సంఘాలకు సంబంధించిన జడ్పిటిసి సభ్యులతో పాటు అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పి ఛైర్మన్ శ్రీనివాసులు

ఐదుగురు డీఎస్పీలు బదిలీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లాలో ఐదుగురు డిఎస్పీలు బదిలీ అయ్యారు. ఈమేరకు జిల్లా పోలీస్‌శాఖకు డిజిపి రాజేంద్రనాథ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు జిల్లా నుండి బదిలీ అయిన డీఎస్పీలు చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి ఈస్ట్ గోదావరి జిల్లా రాజమండ్రి క్రైమ్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. చిత్తూరు ఎస్‌బిడి ఎస్‌పిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి నాయుడుపేట ఎస్డిపిఓగా బదిలీ అయ్యారు. పలమనేరు ఎస్‌డిఓపిగా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి ఆళ్లగడ్డ ఎస్బిఐకి అయ్యారు. నగిరి ఎస్‌డిఓపిగా పనిచేస్తున్న రవికుమార్ కడప డిటి సీబీఎస్‌పీగా బదిలీ అయ్యారు. దిశ డిఎస్పీగా పనిచేస్తున్న బాబు ప్రసాద్ కర్నూలు దిశ డిఎస్పీగా బదిలీ అయ్యారు. ఇతర జిల్లాల నుంచి చిత్తూరు ఎస్డిపిఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు. భీమవరం ఎస్‌డిపిఒ శ్రీనాథ్ కుప్పం ఎస్‌డిపిఒ, కర్నూలు దిశ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి చిత్తూరు దిశ డిఎస్‌పి, నంద్యాల డిఎస్పి మహేశ్వర్ రెడ్డి పలమనేరు డిఎస్పీగా బదిలీపై రానున్నారు. చిత్తూరు ఏఆర్డిఎస్పి మురళీధరను కడపకు బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ఏఆర్‌డిఎస్‌బి మహబూబ్ బాషాను చిత్తూరు ఏఆర్‌డి ఎస్పీగా బదిలీ చేస్తూ డిఐజి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు



నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆర్థిక బకాయిలతో పాటు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగినచర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షల్లో గురువారం రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే పాత పెన్షన్ (ఓపిఎస్) పునరుద్ధరణ చేయాలని, ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరించకపోతే వచ్చే ఎన్నికలలో ఎవరైతే పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటిస్తారో అలాంటి వారికి మా ఓటు ద్వారా బలపరుస్తామని తెలియజేశారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను దీక్షా శిబిరంలో ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి.రమణ మాట్లాడుతూ నిన్నటి రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ దగా డిఎస్సి అని అవేదన వ్యక్తం చేశారు. ప్రకటించిన 6,100 పోస్టులలో ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో కేవలం 75 వరకు మాత్రమే ఖాళీలు చూపే పరిస్థితి ఉన్నదని, అందులో తెలుగు మీడియం ఎస్జీటీ పోస్టులు ఒక్కటి కూడా లేకపోవడం దురదష్టకరమైన సంఘటనగా భావిస్తూ ప్రభుత్వ తీరును దుయ్యబెట్టారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పిఆర్.మునిరత్నం, ప్రసన్నకుమార్, రెడ్డప్ప నాయుడు, సిపి ప్రకాష్ కష్ణమూర్తి, ఏకాంబరం సరిత, ఈశ్వర్, మహేంద్ర, పార్థసారథి, శశి కుమార్ అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు. సాయంత్రం దీక్షను నిమ్మరసం ఇచ్చి విరమణ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మద్దతుగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేంద్రన్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు మదన మోహన్‌రెడ్డి, రూట జిల్లా అధ్యక్షులు మునీర్ అహమ్మద్‌లు పాల్గొని సంఘీభావం తెలిపారు.

మత్తులో జగత్తు.. జీవితం చిత్తు

- విచ్చలవిడిగా గంజాయి అమ్ముతున్న కేటుగాళ్లు
- బానిసలవుతున్న యువత



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

యువతను పెడారిపట్టిస్తున్న గంజాయి జిల్లాలో అక్కడక్కడ పట్టుబడుతూనే ఉంది. జిల్లాలో వారంలో ఎక్కడో ఓ చోట గంజాయి స్మగ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పోలీసుల కళ్ళుగప్పి గుట్టుగా నడుస్తున్న గంజాయి అక్రమ రవాణా దందా యువతను మత్తులో ముంచి పెడదారి పట్టిస్తోంది. పట్టణాలు, గ్రామాలని తేడా లేకుండా గంజాయి విక్రయాలు పెరిగాయి. కళాశాలలు, యూనివర్శిలను టార్గెట్ చేసుకొని చాటుమాటుగా ఈ దందా నడుస్తోంది. మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ పోలీసులు కళాశాల విద్యార్థులు అవగాహన, ప్రచార ప్లేక్సీలు ఏర్పాటు చేస్తున్నా.... జిల్లా సరిహద్దు రాష్ట్రాల నుండీ జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న మాధకద్రవ్యాలను అరికట్టలేకపోతున్నారు. అక్రమమార్గంలో డబ్బులు సంపాదన కోసం యువతను మత్తులో ముంచి కొందరు సొమ్ము చేసుకుంటున్నారని వాస్తవం ...

గంజాయి, నాటు సారా తయారీ విక్రయాలను అరికట్టాల్సిన యంత్రాగం చోద్యం చూస్తోంది. సరిహద్దు రాష్ట్రాలనుండీ చాటుమాటుగా గుట్టుచప్పుడుకాకుండా తరలిస్తున్న మత్తు పదార్థలు యువతను మత్తులో ముంచి యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది. జిల్లా కేంద్రమైన చిత్తూరుకు ఇటు కర్నాటక, అటు తమిళనాడు సరిహద్దు కావడంతో చిత్తూరు నగరంతో పాటు పలమనేరు, కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల నుండీ గంజాయి, ఇతర నిషేధిత మత్తుపదార్థలను తరలించి విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. గంజాయి రవాణా చేసేందుకు అక్రమార్కులు ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకొని పోలీసులకు తెలియకుండా నగరాల్లోని కళాశాలలే టార్గెట్‌గా మారుమూల నిరుద్యోగ యువత ద్వారా విక్రయాలు చేపడుతున్నారు. బడి, గుడి అని తేడా లేక జోరుగా మత్తుపదార్థాల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో నాటు సారా తయారీ విక్రయాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల్లో విక్రయాలను అరికట్టాల్సిన పోలీసుశాఖ తగిన స్థాయిలో దాడులు నిర్వహించి గంజాయి అక్రమ రవాణా అరికట్టాల్సిన అవసరముంది. చాటుమాటుగా సాగుతున్న ఈ దందా వెనక రాజకీయ నేతల అండదండలు ఉండడంతో పోలీసులు కూడా పట్టుబడ్డ నిందితులను నామమాత్రంగా విచారించి విడిచి పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చిత్తూరు రెండు రాష్ట్రాల సరిహద్దు జిల్లా కావడంతో కర్ణాటక నుండి పెద్ద ఎత్తున గుట్టుచప్పుడు కాకుండా భారీ ఎత్తున మత్తు పదార్థలను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కర్ణాటక మద్యం, గంజాయి ఏ ప్రాంతంలో నుండి ఎక్కడి నుండి ఎలా వస్తోందని వివరాలపై పోలీసులు నిఘా ఉంచితే అసలైన నిందితులను పట్టుకొని కట్టడి చేసే అవకాశం ఉంటుంది. గంజాయి నాటు సారా కర్ణాటక అక్రమద్యాలపై దుస్తులుస్తారించి అడ్డుకట్ట వేసి యువత భవిష్యత్తును అంధకారం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



చిత్తూరులో గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్‌ఫొటో)

ప్రభుత్వ భూమి.. ప్రైవేటు ఆసామి..!

- ప్రభుత్వ భూమిపై ఆక్రమణదారుల కన్ను
- సిమెంట్ రోడ్డు, కాలువలు సైతం పూడివేత
- పట్టించుకోని అధికారులు
- పేదలకు భూమి పంచాలని కలెక్టర్‌కు ఫిర్యాదు


ఆక్రమణకు గురైన స్థలం




అడ్డుగా వేసివున్న ఇటుకలు

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని రోజురోజుకు ప్రభుత్వ భూమిని కబ్జా చేసే వారు పెరిగిపోతున్నారు. వారికి అడ్డుగా ఉన్న కాలువలు, సిమెంట్లు రోడ్లను సైతం పూడ్చి వేసి మరీ కబ్జాలకు పూనుకుంటున్నారు. ఇది ఏమిని ప్రశ్నించిన వారిపై దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. మండలంలో ఇంత జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. మరోవైపు మండలంలో పేదలకు ఇళ్ళు, ఇంటి స్థలాలు లేక రేపో మాపో కూలిపోయే ఇళ్ళలోనే ఇప్పటికీ కొంతమంది జీవనం సాగిస్తున్నారు. ఈ విషయాలు రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. దీంతో ఇంటిస్థలాల కోసం కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నారు.

రామాపురం ఎస్సీ కాలనీలో సుమారు 40 కుటుంబాలు ఉన్నాయి. గ్రామాన్ని ఆనుకొని దక్షిణం వైపు సర్వేనెంబర్ 4/2లో 1.36 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని ఇళ్ళు, ఇంటి స్థలాలు ఉన్న కొంతమంది ఆక్రమించుకుని అనుభవిస్తున్నారు. ఆక్రమణదారులకు ఎలాంటి రికార్డులు లేకపోయినా మా తాతలు, మా తండ్రులకు చెందిన ఆస్తులుగా చెప్పుకుంటూ భూమిని కబ్జా చేస్తున్నారు. ఇదేమని అడిగిన వారిపై మూకుమ్మడిగా దాడులు చేస్తూ దౌర్జన్యాలకు పూనుకుంటున్నారు. భూకబ్జాదారుల విషయంలో గతంలో ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదులు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుల పంచనచేరి నాయకుల పేర్లు చెప్పుకుంటూ ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారు. గ్రామంలో ఒక్కొక్కరు రెండు మూడు స్థలాలు ఆక్రమించుకుని ఇళ్ళు, ఇంటి స్థలాలు లేనివారికి ఇబ్బందులు కలిగిస్తున్నారు. నాయకులు కూడా నిజానిజాలు పరిశీలించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. వి.రామాపురంలో ఎంతోమంది స్థలాలు లేక, ఇళ్ళు కట్టుకోలేక నానా అవస్థలు పడుతుంటే మరికొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని దౌర్జన్యానికి పూనుకుంటున్నారు.

అలాగే సుమారు 30 ఏళ్ళ క్రితం ప్రభుత్వ నిధులు ఖర్చు చేసి సిమెంటు రోడ్లు, మురుగు నీటి కాలువలు నిర్మించారు. ప్రస్తుతం సిమెంటు రోడ్లు, కాలువలను కూడా తమ భూమిలో ఉన్నాయంటూ కబ్జాదారులు కాలువలు, సిమెంటు రోడ్లు సైతం పూడ్చేస్తున్నారు. మండలంలో ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ రాజ్ (ఎంపిడిఓ), పోలీసులు పట్టించుకున్న పాపానపోలేదు. సిమెంటు రోడ్డుపై మట్టితోలి అంతరాయం కలిగించినా ఎంపిడిఓ, తహశీల్దార్ కనీసం పరిశీలించలేదని విమర్శలు వస్తున్నాయి. సుమారు 80 నుంచి 90 ఏళ్ళ క్రితం ప్రభుత్వం తాగునీటి సమస్య తీర్చడానికి చేత బావులు త్రవ్వారు. గతంలో ఆ బావి ద్వారానే దళిత కాలనీకి చెందిన వారు నీళ్ళు తెచ్చుకునే వారు. ప్రస్తుతం ఆ బావి చుట్టూ కూడా చెత్తచెదారం వేసి బండలు నాటి కబ్జా చేసి గడ్డివాములు వేసుకున్నారు. గ్రామం చుట్టూ ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. దీన్ని అరికట్టి ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్రభుత్వ స్థలాలు, భూములు అన్యాక్రాంతం కాకుండా అరికట్టి అర్హులైన పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై కేసులు నమోదు చేసి పేదలకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుచున్నారు.

అంగన్వాడీ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆర్‌డిఓకి సిఐటియు వినతి



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ప్రాజెక్టులోని పెద్దపంజాణి మండలం కొలతూరు పంచాయతీ చెందిన ఆర్.ధనలక్ష్మి దాదాపు 20 సంవత్సరాలుగా అంగన్వాడీ వర్కర్‌గా పని చేసింది. వారి హక్కుల కోసం పోరాటంలో భాగంగా సమ్మె కాలంలో అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పలమనేరు ఆర్‌డిఓ మనోజ్ రెడ్డికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈసందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు, నాయకులు ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా, మృతి చెందిన అంగన్వాడీ టీచర్ భర్త ఆర్‌డిఓ మనోజ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐసిడిఎస్‌కి 20 సంవత్సరాల సేవలందించి గ్రామంలో మంచి పేరు తెచ్చుకున్న వర్కర్ చనిపోవడం బాధాకరమన్నారు. పోరాటం చేసి సాధించిన జీవోల ప్రకారం వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం వెంటనే సహాయం చేయాలని కోరారు. నిరవధిక సమ్మెలో చనిపోయినది కాబట్టి విధి నిర్వహణలో చనిపోయినట్లే అని అన్నారు. దీనిపై ఆర్‌డిఓ స్పందిస్తూ కలెక్టర్‌కి ఈ సమస్యను తెలియజేసి వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈసమస్యపై సిడిపిఓ, జిల్లా పీడీ కూడా స్పందించి వారి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వ్యవసాయానికి ప్రాధాన్యత

జెడ్పి ఛైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని నీటి వృథాతో పాటు కలుపు నివారణ కోసం డ్రిప్ విధానం చేపట్టడం జరిగిందని జిల్లా పరిషత్ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. అలాగే రబీ సీజన్‌లో పంటలు వేగంగా విస్తరిస్తున్నాయని పట్టు పరిశ్రమ శాఖలో జిల్లా మొదటి స్థానంలో ఉందని పశుసంవర్ధక శాఖకు సంబంధించి పలు కార్యక్రమాలు చేపట్టి పాడి పరిశ్రమలు ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. మూడవ స్థాయి సంఘమైన వ్యవసాయ రంగాలకు సంబంధించి ఛైర్మన్ అధ్యక్షతన జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాన్ని ఛైర్మన్ ఛాంబర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, పట్టు పరిశ్రమ శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, ఉద్యానవన శాఖ, అటవీ శాఖ అధికారులు నివేదికలను సమర్పించారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు వ్యవసాయరంగానికి మత్స్యశాఖకు ఉద్యానవన శాఖకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగారు. ఈసందర్భంగా జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ అనేక పథకాలు వ్యవసాయ రంగం కోసం నిర్వహిస్తున్నారని, చిత్తూరు జిల్లాలో ప్రధానంగా విత్తనాల పంపిణీ పురుగు మందులు రసాయనిక ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నారని త్వరలో క్రిమిసంహారక మందులు నానో ఎరువులు కూడా సరఫరా చేయడం జరుగుతుందని వివరించారు. పట్టు పరిశ్రమశాఖ ద్వారా పలు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని ఈ ప్రోత్సాహకాలు తీసుకొని మరింతగా పట్టుపరిశ్రమలు అభివృద్ధి చేసుకున్నట్లయితే ఆర్థిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మత్స్య సంపాదన పెంపొందించడానికి మరిన్ని పథకాలు రావడం జరిగిందని ఈ పథకాలను ఉపయోగించుకొని మత్స్యసంపద ద్వారా ఆదాయం పెంపొందించుకోవాలని అన్నారు. జిల్లాలో ఉద్యానపంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మామిడిలో వచ్చే వ్యాధులకు సంబంధించి సస్యరక్షణ చర్యలు ఖర్చు తగ్గించుకోవడం గురించి క్షేత్రస్థాయిలో ఉద్యానవనశాఖలో ఆధ్వర్యంలో పలు అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందని ఎప్పటికప్పుడు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదిస్తూ జిల్లాలో నాణ్యమైన మామిడి ఉత్పత్తులు సాధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థాయి సంఘాలకు సంబంధించిన సభ్యులతోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం తప్పనిసరి: డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి-కార్వేటినగరం: టీబీ రోగులకు పౌష్టికాహారం తప్పనిసరని జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభయాన్ పథకం ద్వారా టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధితో బాధపడుతున్న వారు ప్రతి వైద్యాధికారుల సలహా మేరకు పౌష్టికాహారాన్ని, అలాగే మం దులు తీసుకోవాలన్నారు. అలాగే చల్లటి నీరు, చల్లటి వాతావరణంలో బయటకు వెళ్లకూడదని వాటి ద్వారా శ్వాస కోస వ్యాధులకు గురై అవకాశం ఉంటుందన్నారు. టీబీ రోగానికి ప్రథమ స్థాయిలో చికిత్స పొందితే పూర్తి స్థాయిలో నివారించుకోవచ్చునన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించి సీ సంఖ్యను పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్య క్రమంలో వైద్యులు డాక్టర్ భువనేశ్వరి, పర్యక్షకులు త్యాగు, అంభరిషిరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేర నియంత్రణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి: ఎస్ఐ

ప్రజాశక్తి-సోమల: నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని సోమల ఎస్ఐ వెంకట నరసింహులు అన్నారు. గురువారం మండలంలోని నంజంపేట బస్టాండు కూడలిలో గ్రామస్తులతో ఎస్ఐ సమావేశమై చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని సమస్యలను సానుకూలంగా చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, ఏటీఎం మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసాంఘీక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు వైసీపీ ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల కేంద్రంలో శుక్రవారం వైసీపీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అరగొండ రోడ్డులోని ఎస్ఎల్వీ కళ్యాణమండపం సమీపంలో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత అభ్యర్థి సునీల్ కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

ప్రత్యేక హోదా ప్రకటించాలి: పోటుగారి భాస్కర్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించి తీరాలని చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్నట్లు చెప్పారు. ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, విభజన హామీలు, పోలవరం పూర్తి చేయడం వంటి ప్రధాన డిమాండ్‌లతో నిరసన తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.

శ్మశానాలకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-సదుం: మండలంలోని దళితవాడల్లో శ్మశాన వాటికలకు ప్రభుత్వం భూములు కేటాయించాలని, సదుం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేపల్లి శ్రీనివాసులు, అధ్యక్షులు చింతపల్లి రామచంద్రయ్య గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని దళితవాడలకు శ్మశాన వాటికలకు ప్రభుత్వం భూములు ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీతాపతి, శ్రీరాములు, రమణయ్య, లక్ష్మయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమే ధ్యేయం

ప్రజాశక్తి-సోమల: పూర్తి అందుబాటులో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయం అని పెద్దఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని సోనియా అన్నారు. గురువారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆవులపల్లి గ్రామంలో కుటుంబ డాక్టర్ కార్యక్రమం కింద గ్రామంలోని 70మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు మాత్రలను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలు ఆసుపత్రికి వచ్చేందుకు సౌకర్యం లేక చాలామంది తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని అలాంటి వారి కోసమే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసి నేరుగా వారి గ్రామానికి వెళ్లి వారి ఇంటి వద్దనే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు అందజేయడం జరుగుతోందని వైద్యాధికారిని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ ద్వారం నిర్మించరూ..

ప్రజాశక్తి-నగరి: శ్మశానంలో రూ.1.75 కోట్ల నిధులతో చేపట్టే ఆధునీకరణ పనుల్లో ముఖద్వారం వద్ద ఉన్న ఆర్చిని కూడా నూతనంగా నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. శ్మశానం వద్ద ఉన్న ఆర్చి శిథిలమై పగుళ్లు వదలి ఉందని కూలిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. కూలి ఎవరిమీదైనా పడితే ప్రాణాపాయం సంభవించే ఆస్కారం ఉందని మంత్రి ఆర్కేరోజా చొరవ తీసుకొని శిధిలమైన ఆర్చిని తొలగించి నూతన ఆర్చిని నిర్మించాలని కోరుతున్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలో టేకు మంద పంచాయతీ జెడ్పి ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వైద్యాధికారి లోహిత్‌చంగల్ రాయలు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి పాఠశాలలో శిబిరంలో వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గొల్ల చీమలపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు, బీపీ వివిధ పరీక్షలు డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారికి తగిన మందులు, మాత్రలు అందించారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్లు అందించారు. అనంతరం ఆరోగ్య పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనరల్ ఎస్పో మోహన్, గుణశేఖర్, ఏఎన్ఎంలు, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-సోమల: పుట్టిన ప్రతిబిడ్డ, కడుపులో గర్భస్థ శిశువు అనీమియాకు గురికాకుండా ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఐరన్ లోపం కారణంగా అనీమియా వ్యాధికి గురయ్యే అవకాశం ఉందన్న ఆలోచనతో ప్రతి ప్రభుత్వ వైద్యశాల పరిధిలోని అంగన్వాడి, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు అదేవిధంగా గర్భం దాల్చిన ప్రతి గర్భవతికి ఐరన్ సిరప్, అవసరమైన వారికి పింక్, బ్లూ మాత్రలను మింగించడం జరుగుతోందని వారు తెలిపారు.

పౌష్టికాహారం సకాలంలో అందించాలి

స్త్రీ శిశు సంక్షేమశాఖ ఛైర్‌పర్సన్ భారతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలకు సంబంధించి ప్రభుత్వం అందించే నాణ్యమైన ఆహారాన్ని క్షేత్రస్థాయిలో సకాలంలో అందించి ఇబ్బందులు రాకుండా చూడడంతో పాటు వారి సంపూర్ణ ఆరోగ్యానికి కృషి చేయాలని జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీకి చెందిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఛైర్‌పర్సన్ సిఆర్ భారతి అన్నారు. గురువారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఛాంబర్‌లో స్త్రీ మహిళ శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలో 2420 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయని, 57వేల మందికి ఆహారం అందించడం జరుగుతుందని నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా అనీమియా రాకుండా చూడడం జరుగుతుందని వివరించారు. ఈసందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎటువంటి సమయంలో కూడా వారి ఆరోగ్యం పట్ల అశ్రద్ధ తగదని వారు సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండేందుకు వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు బేరీజు వేసి తగిన ఆహారం అందించాలని అన్నారు. అవసరమైన వారికి వైద్యసహాయం కూడా అందించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ రక్తహీనత పరిస్థితులు లేకుండా చూడాలని అన్నారు.

అక్రమ కట్టడాన్ని ప్రశ్నిస్తే దౌర్జన్యాలా..?

- మహిళా సర్పంచ్ భర్త అరెస్టును ఖండించిన టిడిపి మైనార్టీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నేతలు


ప్రజాశక్తి-పలమనేరు: బైరెడ్డిపల్లి మండలం దేవదొడ్డికి చెందిన మహిళా సర్పంచ్ భర్త అమీర్ జాన్‌పై వైసీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడడంతో పాటు పోలీసులు అరెస్టు చేయడం దారుణమని టీడీపీ మైనారిటీ నాయకులు పేర్కొన్నారు. పలమనేర్ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం మైనారిటీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారం చేతిలో ఉందని దేవ దొడ్డి ఎంపీటీసీ అహంతో అమీర్జాన్‌కు చెందిన స్థలంలో దౌర్జన్యంగా అక్రమ కట్టడాన్ని కడుతుండగా ప్రశ్నించినందుకు దౌర్జన్యానికి పాల్పడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. దీనిపై పోలీసు అధికారులు సైతం వైసీపీ నేతలకు వత్తాసు పలకడం దారుణమన్నారు. మరోవైపు కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ బాధితుడైన అమీర్‌జాన్ ఫిర్యాదును పక్కనపెట్టి కావాలనే కేసులను తిరగదోడి అతన్నే అరెస్టు చేసి జైలుకు పంపడం విడ్డూరం అన్నారు. మైనారిటీల ఓట్లతో గద్దెనెక్కి ఆ మైనారిటీలపైనే దాడులు చేయడాన్ని మైనారిటీ సోదరులందరూ గుర్తించాలన్నారు. వైసీపీ నేతలు కక్ష గట్టుకుని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం అయితే తామంతా ఏకమై ప్రతిఘటించాల్సిన పరిస్థితులు నెలకొంటాయని వారు హెచ్చరించారు. సమావేశంలో మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఖాజాపీర్, నాయకులు చాంద్బాషా, ముబారక్, రహీం, హనీఫ్, మాబాషా, అఫ్రోజ్, బాబాజాన్, అమానుల్లా, షరీఫ్, మౌలా, నదీమ్, సాదిక్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ దిగుబడులతోనే సంపూర్ణ ఆరోగ్యం


వారపు సంతను ప్రారంభిస్తున్న ఎంపీపీ లతబాలాజీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రకృతి వ్యవసాయ పంటలను ఆహారంగా తీసుకోవడం ద్వారా మానవుని ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలను విక్రయించికోవడానికి మార్కెట్‌ను ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకుని పంటల సాగుకు ముందుకు రావాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారపు సంతలు ఏర్పాటు చేసి రైతు పండించే పంటలకు దళారీ వ్యవస్థ లేకుండా రైతులే మార్కెట్లో అమ్మకాలు చేసుకుని స్వయంగా లాభాలు గడించే విధంగా చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు. గతంలో రైతులు ప్రకృతి వ్యవసాయమే చేసే వారని అప్పట్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండే వారని గుర్తు చేశారు. నేడు విరివిగా రసాయనిక ఎరువులతో కూడిన వ్యవసాయం చేయడం ద్వారా అన్ని రకాలైన వ్యాధులు వయస్సుకు పరిమితం లేకుండా వ్యాపిస్తూ ఆర్థికంగా ప్రజలు నష్టపోతున్నారని తెలిపారు. ఒక్క దేశవాళి ఆవు ఉంటే వాటి గోమూత్రం, పేడతో 20 నుంచి 30 ఎకరాల వరకు సాగుచేసుకోవచ్చని తెలిపారు. జీవామృతం, సీమామృతం, ఘన,ద్రవ వంటి కషాయాలను తయారు చేసుకుని భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేసి మానవాళి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం ఎంఎం విలాసం, ఆర్కేవీబీపేట రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన వారపు సంతలో అమ్మకాలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, వైస్ సర్పంచ్ శేషాద్రి, ఎంపీడీవో మోహన్‌మురళీ, ఏఈవో గాయత్రి, లోకనాధనాయుడు, డీఆర్డీఏ సిబ్బంది, సీసీలు, మాస్టర్ ట్రైనర్ హనుమంతు, యూనిట్ ఇన్చార్జిలు మురళి, సురేష్, రైతులు పలువురు పాల్గొన్నారు.

'రా కదలి రా' సభాస్థలికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు తలపెట్టిన 'రా కదలిరా' కార్యక్రమం ఈ నెల 6న గంగాధరనెల్లూరులో నిర్వహించనున్నారు. ఈ మేరకు మండలంలోని రామానాయుడుపల్లి వద్ద సభా ప్రాంగణం నిర్వహించేందుకు ఆ పార్టీ నేతలు నిర్ణయించుకున్నారు. గురువారం మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు పులివర్తినాని, నేతలు డాక్టర్ థామస్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డాక్టర్ మురళీమోహన్, గాలి భానుప్రకాష్, చిట్టిబాబునాయుడు, చంద్రప్రకాష్ సభస్థలానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామిదాస్, కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, దేవసుందరం, వెంకటేష్, నియాజ్ అలీ, రాంబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు బాలికల జట్టు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా స్థాయిలో గురువారం జరిగిన మహిళల క్రికెట్ పోటీలలో పెద్దపంజాణి మండలం కోగిలేరు సచివాలయం పరిధిలోని పొట్టగానిపల్లెకు చెందిన బాలికలు ఎంపికైనట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం తెలిపారు. చిత్తూరులో జరిగిన జిల్లా స్థాయిలో బాలికల క్రికెట్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన బాలికల జట్టును జడ్పిటిసి సుష్మ కీర్తి, ఈవోపిఆర్డి శారదాదేవి, కోగిలేరు సర్పంచ్ రమేష్ బాబు, ఎంపిటిసి పరందామ, పంచాయతీ కార్యదర్శి మహేష్, నాయకులు శివశంకర్ రెడ్డి, భాస్కర్, ప్రకాష్, సుబ్రమణ్యం, హరిప్రసాద్ రెడ్డి, పీడీ తులసిరాం, అన్నాదొరై, గ్రామస్తులు రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలికలను అభినందించారు.

గ్యాస్ వినియోగదారులకు తప్పని తిప్పలు


గ్యాస్ గోడౌన్ వద్ద వేచి ఉన్న వినియోగదారులు

ప్రజాశక్తి-నగరి: ఇండేన్‌గ్యాస్ వినియోగదారులకు తంటాలు తప్పడం లేదు. రెండు వారాలకు ఒక సారి గ్యాస్ సిలిండర్ లోడ్ వస్తుండటంతో అవసరాలకు వినియోగదారులకు సిలిండర్లు అందడం లేదు. ఎప్పుడు లోడ్ వస్తుందో అంటూ ఏజన్సీ వారిని సంప్రదిస్తూ పడిగాపులు కాయాల్సివస్తోంది. గురువారం లోడ్డు రావడంతో వినియోగదారులు ఏజన్సీ కార్యాలయం వద్ద బారులు తీరారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన వారు క్యూలో గంటలకొద్దీ వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా ఉన్న అధికారులు దీనిపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుకుంటున్నారు.

సిమెంటు రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధి కాకవేడు సచివాలయం రాజీవ్‌నగర్‌లో సిమెంటు రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు సిమెంటు రోడ్డు కావాలంటూ మంత్రి ఆర్‌కే రోజాకు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన ఆమె గడపగడకు నిధుల ద్వారా సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో నివేదికలు సిద్ధం చేసిన అధికారులు రూ. 3.5 లక్షల నిధులతో సిమెంటు రోడ్డు పనులకు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ నరేష్, స్థానిక నాయకులు మునివేలు, చిన్నదొరై తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-సదుం: డప్పు కళాకారులకు నూతనంగా మంజూరైన గుర్తింపు కార్డులను లబ్ధిదారులకు గురువారం ఎంపీపీ ఎల్లప్ప చేతుల మీదుగా అందజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి కార్డులను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో వరప్రసాద్, ఆర్ఐ ప్రసాద్, వైసీపీ మండల కన్వీనర్ రెడ్డపరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ ప్రకాశ్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అడుగుజాడల్లో నడుస్తా..: రాజేష్


కుతూహలమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న రాజేష్

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ ఆశీస్సులు తనకు ఎప్పుడూ ఉంటాయని.. ఆమె అడుగుజాడల్లోనే నడుస్తానని సత్యవేడు వైసీపీ ఇన్‌ఛార్జ్ నూకతోటి రాజేష్ అన్నారు. బుధవారం ఆయనను అధిష్టానం సత్యవేడు ఇన్‌ఛార్జ్‌గా ప్రకటించింది. దీంతో గురువారం ఆయన మండల పరిధిలోని విజం పంచాయతీ మిట్టూరులోని కుతూహలమ్మ సమాధి వద్దకు చేరుకొని నివాళులర్పించారు. అనంతరం స్థానిక వైసీపీ నేతలు దేవా, రామచంద్రారెడ్డి, భానుప్రకాష్ రెడ్డి తదితరులు పూలమాలతో నూక తోటి రాజేష్‌ను సన్మానించారు.

'బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి'

ప్రజాశక్తి-పలమనేరు: బడి ఈడు పిల్లాలు తప్పని సరిగా పాఠశాలకు వెల్లాలని పగడాల శ్రీనివాసు రావు ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయవాదులు అన్నారు. గురువారం పలమనేరు షికారి కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. 'స్టేట్ చిల్డ్రన్స్ డే' సందర్భంగా హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు ఈ యొక్క సదస్సును నిర్వహించినట్లు ఆయన చెప్పారు. న్యాయవాదులు సయ్యద్, మొహద్దీన్, ఆరిఫ్ ఉల్లా ఖాన్ తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. సదస్సులో న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.